క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే సబితారెడ్డి రాక

కందుకూరు: మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి శనివారం కందుకూరులో నిర్వహించనున్న మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొనడానికి రానున్నట్లు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటల వరకు కందుకూరు చేరుకుంటారని ఆయన తెలిపారు.

కందుకూరు మండల సర్వసభ్య సమావేశం నేడు

కందుకూరు: ఎంపీపీ మంద జ్యోతిపాండు అధ్యక్షతన శనివారం ఉదయం 10:30 గంటలకు కందుకూరు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకట్రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సభ్యులతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

అక్రమాలను అరికట్టండి

కందుకూరు: మండలంలోని అన్నోజిగూడ, తిమ్మాయిపల్లి పరిధిలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని కోరుతూ మాజీ ఉప సర్పంచ్ గొర్రెంకల యాదయ్య శుక్రవారం కలెక్టర్‌తో పాటు డీఆర్ఓ, ఆర్డీఓ, తహసీల్దార్‌కు వినతి పత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తిమ్మాయిపల్లి సర్వే నంబర్ 15, కందుకూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 275 ప్రభుత్వ భూముల్లో కొందరు ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారని, ఇక్కడ నిర్మాణాలు సైతం కొనసాగుతున్నాయని తెలిపారు. మరో పక్క ప్రభుత్వ భూముల నుంచి అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరామన్నారు.

రేషన్ దుకాణాలను అర్హులకు కేటాయించండి



డిప్యూటీ కలెక్టర్‌తో మాట్లాడుతున్న అనితారాణి

బడంగ్‌పేట్: గత ప్రభుత్వం రేషన్ దుకాణాలను అనర్హులకు కేటాయించిందని బీజేపీ 21వ డివిజన్ కార్పొరేటర్ బంగారు అనితారాణి డిప్యూటీ కలెక్టర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అనితారాణి మాట్లాడుతూ బడంగ్‌పేట గ్రామ జనాభా పెరగడంతో నాలుగు కొత్త దుకాణాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ దుకాణాల్లో గత ప్రభుత్వం అర్హులను కాదని ఆర్థికంగా స్థిరపడిన వారిని, బంధుప్రీతి కలవారిని, స్థానిక కార్పొరేటర్ల కుటుంబ సభ్యులకు కేటాయించారని ఫిర్యాదులో వివరించారు. ఇది ఫుడ్ కార్పొరేషన్ నియమ నిబంధనలకు వ్యతిరేకమని ఆమె పేర్కొన్నారు. ఈ విషయంలో సమగ్ర విచారణ చేసి అర్హులకు కేటాయించాలని కార్పొరేటర్ అనితా అధికారులకు విన్నవించారు.

సదానందస్వామికి వివేకానంద సేవా అవార్డు



అవార్డు అందుకుంటున్న సదానందస్వామి ముదిరాజ్

కందుకూరు: మండల పరిధిలోని అన్నోజిగూడకు చెందిన కాకి సదానందస్వామిముదిరాజ్ స్వామి వివేకానంద సేవా పురస్కారాన్ని అందుకున్నారు. నవ భారతి నిర్మాణ ఫౌండేషన్ సంస్థ హైదరాబాద్‌లోని తెలంగాణ సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో శుక్రవారం వివేకానంద జయంతి ఉత్సవాలు నిర్వహించింది. వివిధ రంగాల్లో సేవ చేస్తున్న వారిని ఎంపిక చేసి అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్‌ముదిరాజ్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, మాజీ మంత్రి డాక్టర్ బాబు మోహన్ చేతుల మీదుగా సదానందస్వామిని సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్: మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తానని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఏట్ల ఎర్రవల్లి గ్రామంలో దర్గా మరమ్మతులకు, ప్రహరీ నిర్మాణానికి ఎంపీ నిధులతో చేపట్టిన పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలతో పాటు ముస్లింల సంక్షేమానికి తమ పార్టీ కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, పీసరి రాజేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

పన్నులపై ఫోకస్

- వందశాతం వసూలు లక్ష్యం చేరుకునేలా ప్రణాళిక
- ఈ ఆర్థిక సంవత్సరం మీర్‌పేట్ టార్గెట్ రూ.17.20 కోట్లు
- ఇప్పటి వరకు వసూలైంది రూ.7 కోట్లు
- ట్రేడ్ లైసెన్స్‌లపై స్పెషల్ డ్రైవ్



మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

మీర్‌పేట: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆస్తి పన్ను వసూళ్లను వేగిరం చేశారు అధికారులు. 2023- 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కార్పొరేషన్‌లో 17,927 గృహ నివాసాలు, 1,340 వాణిజ్య సముదాయాలు, 1,077 మిక్స్‌డ్(గృహ-వాణిజ్య) కలిపి మొత్తం 20,284 భవనాలకు గాను రూ.17.20 కోట్లు డిమాండ్‌గా నిర్ణయించారు. ఇప్పటివరకు సుమారు రూ.7 కోట్ల వరకు వసూలు చేయగా.. మరో రూ.10 కోట్లు పెండింగ్‌లో ఉంది. మార్చి 31 నాటికి ఆస్తిపన్ను లక్ష్యాన్ని చేరుకునేలా సిబ్బందికి దిశానిర్దేశం చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. జీహెచ్ఎంసీ కన్నా మీర్‌పేట కార్పొరేషన్‌లో పన్నుల భారం అధికంగా ఉందని, త్వరలోనే ప్రభుత్వం వీటిని తగ్గిస్తుందన్న ప్రచారంతో గతేడాది చాలా మంది ట్యాక్సులు చెల్లించేందుకు ముందుకు రాలేదు. దీంతో 70 శాతం మాత్రమే వసూలు చేయగలిగారు. ఈసారి శత శాతం లక్ష్యం చేరేలా ప్రణాళికలు సిద్ధం చేశామని కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు.

1,500 వాణిజ్య సముదాయాలు

కార్పొరేషన్‌లో సుమారు 1,500 వాణిజ్య సముదాయాలున్నాయి. వీటి ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా మున్సిపాలిటీకి సుమారు రూ.50 లక్షల ఆదాయం వస్తుంది. గతంలో స్థానిక రాజకీయ నేతల ఒత్తిళ్లు, ఇతరత్రా కారణాల వల్ల ట్రేడ్ లైసెన్సుల ఆదాయంపై యంత్రాంగం పెద్దగా దృష్టి పెట్టలేదనే ఆరోపణలు ఉండేవి. కానీ గతేడాది నుంచి సంబంధిత వాణిజ్య సముదాయాల యజమానులు లైసెన్సులు తీసుకునేలా అధికారులు సిబ్బందిని నేరుగా పంపించి అవగాహన కల్పించారు. ఇప్పటివరకు ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా 40 శాతం సొమ్ము వసూలైందని, మరో రెండు నెలల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పూర్తి స్థాయిలో వసూలు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

“రెడ్ నోటీసులు ఇస్తాం



కమిషనర్ ఆదేశాల మేరకు మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేస్తాం. అయినా స్పందించకపోతే తదుపరి చర్యలు తీసుకుంటాం. ప్రజలంతా గడువు లోపు ఆస్తి పన్ను చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలి.

– అంజన్‌రెడ్డి, రెవెన్యూ అధికారి

బస్ టెర్మినల్ ప్రారంభం



బస్ టెర్మినల్ ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: అందరికి అందుబాటులో బస్ టెర్మినల్ ఉండాలని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం బడంగ్‌పేట చౌరస్తాలో మిధాని డిపో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్ టెర్మినల్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు, ప్రయాణికులకు అందుబాటులో బస్ టెర్మినల్ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గౌర రమాదేవి, రాళ్లగూడెం సంతోష, వంగేటి ప్రభాకర్‌రెడ్డి, దర్శన్‌రెడ్డి, బాలు, మిధాని డిపో మేనేజర్ ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన అభివృద్ధి కాంగ్రెస్‌తో సాధ్యం

మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్



కాంగ్రెస్‌లో చేరుతున్న గిరిజన నాయకులు

తుక్కుగూడ: గిరిజన అభివృద్ధి కాంగ్రెస్‌తో సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కిచ్చనగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని బాసగూడతండాకు చెందిన గిరిజనులు ఆయా పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కిచ్చనగారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఆరు గ్యారంటీ పథకాల ద్వారా సామాజిక న్యాయం, అభివృద్ధి జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త పని చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

- సీఎం స్పందించి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి
- ఎమ్మార్పీఎస్ టీఎస్ నేతల డిమాండ్



కందుకూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ టీస్ నాయకులు

కందుకూరు: వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, కోర్ కమిటీ సభ్యుడు చిన్నగళ్ల యాదగిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. మేడి పాపయ్య నాయకత్వంలో ఏబీసీడీ వర్గీకరణ లక్ష్య సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తున్నామన్నారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. దళితబంధు పథకాన్ని కొనసాగించాలని కోరారు.

నూతన ప్రతినిధుల ఎంపిక..

అనంతరం ఎన్నుకున్న ఎమ్మార్పీఎస్ టీఎస్ నూతన కమిటీలను ప్రకటించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాల్‌రాజు, కార్యదర్శిగా బర్ల యాదయ్య, మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడిగా వడ్డెమోని దాసు, కందుకూరు మండల అధ్యక్షుడిగా గడ్డం రాంచంద్రి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిన్నగళ్ల బాల్‌రాజ్, అధికార ప్రతినిధిగా మంద కృష్ణను ఎన్నుకున్నారు.

కేంద్రం విధానాలపై పోరాడుదాం

- పేదలపై భారం మోపుతున్న మోదీ సర్కార్
- రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగారెడ్డి
- కందుకూరులో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల సమావేశం



మాట్లాడుతున్న రైతు సంఘం ఉపాధ్యక్షుడు జంగారెడ్డి

కందుకూరు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, మతోన్మాద, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జంగారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాషానరహరి భవన్‌లో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.రాంచందర్ అధ్యక్షతన రైతు, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో పేదలు నిరుపేదలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ ప్రజలపై మోయలేని భారాన్ని మోపుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాలతో మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని, లేబర్ కోడ్ బిల్లుతో కార్మిక రంగం కుదేలయ్యేలా చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫిబ్రవరి 16 వరకు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మూడు సంఘాలు సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు జిల్లా వ్యాప్తంగా ఇంటింటికి వెళ్లి ప్రజలకు ప్రచారం చేయాలన్నారు. మోదీ దుర్మార్గపు పాలనను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.రాజు, ఎం.చంద్రమోహన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.అంజయ్య, కె.జగన్, నాయకులు జగదీశ్, కిషన్, సీహెచ్ జంగయ్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన సమస్యలన్నీ పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే



హుడా భారతినగర్‌లో ఎస్ఎన్‌డీపీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలన్నింటినీ పరిష్కరించి ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని హుడా భారతినగర్‌లో జరుగుతున్న ఎస్ఎన్‌డీపీ పనులను ఆయన అధికారులు, స్థానిక నాయకులు, కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో ఈ కాలనీలో ఎస్ఎన్‌డీపీ పనులను ప్రారంభించామని, ఆ పనుల్లో భాగంగా డ్రైన్ పనులకు ప్రస్తుతం ఉన్న స్థలంలో డ్రైన్‌కు అనుకూలంగా లేకపోవడంతో ప్రైవేటు స్థలయజమానిని ఒప్పించి కొంత స్థలం ఇవ్వడానికి అంగీకారం తీసుకున్నామన్నారు. కాగా, కాలనీలో డ్రైన్‌ను 90 డిగ్రీల కోణంలో నిర్మిస్తే చాలా ఇబ్బందులు వస్తాయని కాలనీవాసులు చెప్పన్నారని, వారి విజ్ఞప్తి మేరకు 45 డిగ్రీల కోణంలోనే డ్రైన్‌ను నిర్మించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. దానికి అనుగుణంగా అక్కడ రోడ్డుమీద ఉన్న విద్యుత్ స్తంభాన్ని పక్కకు జరపాలని సూచించారు. దీంతో కాలనీవాసులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈఈ కృష్ణయ్య, కిరన్‌సాగర్, విజయ్ కుమార్, రాంచందర్, రవీందర్‌రెడ్డి ,హేమూనాయక్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఆందోజు సత్యంచారి, శ్రీనివాస్‌నాయక్, రఘుమారెడ్డి, శివారెడ్డి, నాగిరెడ్డి, సయ్యద్ పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయం

ఎంపీపీ మంద జ్యోతిపాండు

కందుకూరు: దేశంలో పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రధాని మోడీ పని చేస్తున్నారని ఎంపీపీ మంద జ్యోతిపాండు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని బాచుపల్లిలో సర్పంచ్ యాలాల శ్రీనివాస్‌తో కలిసి గ్రామంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు సంబంధించిన నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పంటలపై మందులు పిచికారి చేసే డ్రోన్ల ఏర్పాటును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 2047సంవత్సరం వరకు భారత దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్న ధ్యేయంతో మోడీ కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు విన్సెంట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ పెద్దలు భూపాల్‌రెడ్డి, పాతిమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు

వనస్థలిపురం: అయోధ్య రామ మందిరంలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వనస్థలిపురం ఎన్జీఓస్ కాలనీలోని ఎల్లమ్మ ఆలయం, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర, వనస్థలిపురంల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమాల బ్రోచర్‌ను శుక్రవారం ఆయన విడుదల చేశారు. ఈ నెల 22న వనస్థలిపురం ఛత్రపతి శివాజీ గ్రౌండ్స్‌లో శ్రీరామ జ్యోతి, మహిళలచే లక్ష దీపోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. యాదగిరిరావు, నారాయణరావు, రాంరెడ్డి పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి దేవస్థానంలో...

వనస్థలిపురం ఫేజ్-1లోని మల్లికార్జున స్వామి దేవస్థానంలో అయోధ్య రామ మందిరంలో ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఈ నెల 22 వరకు నిత్యం అఖండ దీపారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 17, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 35, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 16, క్యారెట్ 32, దొండ 28, ఆలు 23, ఉల్లి 24, గోకర 45, దోస 26, సొర 09, పొట్ల 13, అరటి 09, చిక్కుడు 35, అర్వి 67, మునగ 75, చిలగడదుంప 55, బీట్‌రూట్ 17, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 35, కాప్సికమ్ 50.

బహుజన రాజ్యాధికారమే లక్ష్యం

బీఎస్పీ ఉపాధ్యక్షుడు దయానందరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ ఆర్య



శ్రీశైలానికి నియామక పత్రం అందజేస్తున్న దయానందరావు, విజయ ఆర్య

షాబాద్: బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా బీఎస్పీ పని చేస్తోందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాగిల్ల దయానందరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ ఆర్య పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలోని పీఆర్ఆర్ మినీ స్టేడియంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా కర్రె శ్రీశైలాన్ని నియమించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు నడుచుకోవాలన్నారు. బహుజన రాజ్యంతోనే ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందన్నారు. మాయావతి స్ఫూర్తితో బహుజనులకు రాజ్యాధికారంలో వాటా కల్పించేందుకే పోరాటం విస్తృతం చేయాలన్నారు. బహుజనులందరూ కలుద్దాం, నిలుద్దాం, గెలుద్దాం అనే నినాదంతో ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్, రాజమహేంద్రవర్మ, సుధాకర్, ప్రభాకర్, శ్రీనివాస్, సతీష్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

'బడి'లో ఎన్నికలు

- నేడు నోటిఫికేషన్ విడుదల
- రెండేళ్ల నిరీక్షణకు తెర
- ఏర్పాట్లు చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

కేశంపేట: పాఠశాల విద్యాకమిటీల ఎన్నిక నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం షెడ్యూల్ విడుదల చేయనుంది. ఈ షెడ్యూల్ ప్రకారం కేజీబీవీ, జిల్లా పరిషత్, మండల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యాకమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లను, సభ్యులను రెండేళ్ల కాలపరిమితికి ఎన్నుకుంటారు. వారు రెండేళ్లకు మించకుండా పదవిలో కొనసాగుతారు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి పాఠశాల విద్యాకమిటీ సమావేశాలను నిర్వహిస్తుంది. ఈ సమావేశాల్లో పాఠశాల అభివృద్ధికి తీర్మాణాలను చేస్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో 2019 నవంబర్ 30న ఎస్ఎంసీ కమిటీలను ఎన్నుకున్నారు. వీరి కాలపరిమితి రెండేళ్లు పూర్తయిన రాష్ట్ర ప్రభుత్వం పదవి కాలాన్ని పొడిగిస్తూ వచ్చింది.

కమిటీలో సభ్యులుగా...

పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, అంగన్‌వాడీ టీచరు, ఏఎన్ఎం, మహిళ సమాఖ్య అధ్యక్షురాలు కమిటీలో సభ్యులుగా వ్యవహరిస్తారు.

కో ఆప్షన్ సభ్యులు

పూర్వ విద్యార్థుల నుంచి లేదా విద్యావేత్తను లేదా దాతను లేదా స్వచ్ఛంద సంస్థ సభ్యులను తీసుకోవచ్చు. శాశ్వత ఆహ్వానితుడుగా సర్పంచ్ వ్యవహరిస్తాడు.

మార్గదర్శకాలు..

- ప్రాథమిక పాఠశాలలో 1నుంచి 5వ తరగతి వరకు తరగతికి ముగ్గురు చొప్పున్న 15 మందిని ఎన్నుకోవాలి. వీరిలో 10 మంది మహిళలు ఖచ్చితంగా ఉండాలి.
- ప్రాథమికోన్నత పాఠశాలలో 1నుంచి 7వ తరగతి వరకు 21 మందిని, వీరిలో 14 మంది మహిళలు ఉండాలి. 8వ తరగతి వరకు ఉంటే 24 మందిని ఎన్నుకోవాలి. వీరిలో 16 మంది మహిళలను ఎన్నుకోవాలి.
- ఉన్నత పాఠశాలలో 6వతరగతి నుంచి 8వ తరగతి వరకు 9మందిని మాత్రమే ఎన్నుకోవాల్సి ఉంటుంది. వీరిలో 6మంది మహిళలను తీసుకోవాలి.
- ఆయా పాఠశాలలో సభ్యులందరూ కలిసి చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఓటింగ్ ద్వారా గానీ, చేతులెత్తడం ద్వారా గానీ ఎన్నుకుంటారు.

సభ్యుల బాధ్యత...

- పాఠశాల కమిటీలో ఎన్నికైన వారు ఖచ్చితంగా కమిటీ సమావేశాలకు హాజరుకావాల్సి ఉంటుంది.
- పిల్లల చదువుల పురోగతిని పరిశీలిస్తూ విద్యాభివృద్ధికి పాటుపడాలి.
- పిల్లల, ఉపాధ్యాయుల హాజరును పరిశీలిస్తుండాలి.
- బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలి.
- పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి.

నోటిఫికేషన్...

- నేడు ఉదయం పది గంటలకు పాఠశాలలో ఎస్ఎంసీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపికకు నోటిఫికేషన్ విడుదల కానుంది.
- మధ్యాహ్నం 2గంటలకు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడు అక్కడ చదివే విద్యార్థుల తల్లి దండ్రుల పేర్లను నోటీస్ బోర్డుపై ఉంచుతారు.
- 22న అభ్యంతరాలు ఉంటే ప్రధానోపాధ్యాయుడు స్వీకరిస్తారు.
- 24న అభ్యంతరాల పరిశీలన అనంతరం తుది జాబితను నోటీస్ బోర్డుపై ఉంచుతారు.
- 29న మధ్యాహ్నం 1గంట వరకు ఎస్ఎంసీ సభ్యులతో పాటు చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకుంటారు.
- 29న మధ్యాహ్నం రెండు గంటల నుంచి 4గంటల వరకు ఎస్ఎంసీ మొదటి సమావేశం నిర్వహిస్తారు.

కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు

చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ సాత్వీకరెడ్డి

మొయినాబాద్‌రూరల్: కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ సాత్వీకరెడ్డి అన్నారు. శుక్రవారం హిమాయత్‌నగర్ సమీపంలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో రసాయన శాస్త్ర విభాగంలో డి గౌతమి డాక్టరేట్ తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయన శాస్త్ర విభాగంలో 'సింథసిస్ అండ్ బయోలాజికల్ ఎవ్యాల్యుయేషన్ ఆఫ్ నావెల్ క్వినోక్సలిన్ అండ్ ఇండోల్ స్కాఫోల్డ్స్ అండ్ పెయిర్ మాలిక్యూలర్ డాకింగ్ స్టడీస్' అనే అంశంపై డాక్టర్ రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్ పర్యవేక్షణలో డి గౌతమి పరిశోధన చేశారన్నారు. అనంతరం యూనివర్సిటీ కులపతి డాక్టర్ సిహెచ్‌వి పురుషోత్తమ్‌రెడ్డి, సాత్వీకారెడ్డిలు గౌతమిని అభినందించారు. ఈ సమావేశంలో డీన్ ప్రొఫెసర్ ప్రతాప్, ప్రొఫెసర్ కిష్టఫర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవీందర్, హెడ్ ప్రొఫెసర్ రాజేందర్, అధ్యాపకులు అవని, మహాదేవ్, కన్నాన్, శ్వేత, దేశ్ పాండే, లక్ష్మి, పబ్లిక్ రిలేషన్ అధికారి గాదే రాంబాబు, కంట్రోలర్ జగదీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



కుట్టు మిషన్లను అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

చేవెళ్ల: ఉచిత టైలరింగ్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కేపీ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ టి రాజ్‌కుమార్ తెలిపారు. చేవెళ్ల మండల కేంద్రంలో వారం రోజులుగా ఉషా ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆర్థిక సహకారంతో నిర్వహించిన ఉచిత టైలరింగ్ శిక్షణ ముగింపు సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణపొందిన 10 మందికి కుట్టుమిషన్లు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలోని పలు మండలాల్లో కూడా మహిళలకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళలు స్వయంఉపాధిలో రాణించి ఆర్థికంగా కుటుంబానికి అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకుడు శశికుమార్, మహిళలు పాల్గొన్నారు.